సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



కమిటీ సభ్యులదే పూర్తి బాధ్యత

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణపతి మంటపాలను ఎస్పీ ఆదేశాలతో పోలీసు అధికారులు, సిబ్బంది, శని, ఆదివారాల్లో సందర్శించి వాటి అనుమతులను పరిశీలించారు. - 8లో



విటమిన్స్ ఫుల్

విదేశాల్లో సంపన్నులు తినే డ్రాగన్ ఫ్రూట్‌ను చూడడమే అరుదు. పార్వతీపురం మన్యం జిల్లాలోని ఔత్సాహిక రైతులు దీన్ని సాగు చేస్తుండడం ప్రత్యేకత సంతరించుకుంటోంది. - 8లో

నేడు పాఠశాలలకు సెలవు

పార్వతీపురం: వర్షాల కారణంగా పాఠశాలకు సోమవారం సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ కేంద్ర హెచ్చరిక మేరకు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులు గమనించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో కేసుల రాజీకి చర్యలు



ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన పోలీస్ అధికారుతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 14న కోర్టుల్లో జాతీయ మెగా లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. జాతీయ మెగాలోక్ అదాలత్‌ను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల అధికారులతో వారి వారి స్టేషన్ లకు సంబంధించి రాజీ అయ్యే కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల్లో ఇరుపక్షాల సమ్మతితో వారి కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర కేసులను కూడా వీలైనంత వరకు ఎక్కువగా డిస్పోజల్ చేయాలని సూచించారు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్న కక్షిదారులు వారి కేసులను లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించు కునేలా చర్యలు చేపట్టాలని, కేసులు రాజీ ద్వారా పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగే శ్రమ, సమయం తగ్గుతుందని, డబ్బు ఆదాతో పాటూ సత్వరం పరిష్కారం లభిస్తుందని తెలియజేయాలని సూచించారు.

నేటి గ్రీవెన్స్ రద్దు

పార్వతీపురం: భారీ వర్ష సూచన మేరకు గ్రీవెన్స్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) సెల్‌ను సోమవారం రద్దు చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ఆస్కారం ఉందని చెప్పారు. వాటిని దాటుకుంటూ రావడం సురక్షితం కాదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి వ్యయ ప్రయాసలకు గురై జిల్లాకేంద్రానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

బిత్రపాడు పంటపొలాల్లోనే ఏనుగుల గుంపు



పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లభద్ర,నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగులు ఆదివారం ఉదయం దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పామాయిల్ తోటలో ఉండి గుమ్మడిగెడ్డ వాగులోకి జారుకున్నాయి. సాయంత్రానికి నిమ్మలపాడు నుంచి బిత్రపాడు పరిసర ప్రాంతాల్లోకి వచ్చాయి. చీకటి పడిన సమయంలో మళ్లీ గ్రామంలోకి ఏనుగులు వస్తాయని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అటవీ సిబ్బంది వాటిని తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

డీసీపీయూ పోస్టులకు మళ్లీ నోటిఫికేషన్!

- ఆందోళనలో అభ్యర్థులు

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లు రద్దు చేయడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుంది. అధికారంలోకి వస్తే లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లు రద్దు చేసి తమ ప్రభుత్వంలో ఉద్యోగాలు కల్పించామని గొప్పలు చెప్పుకునేందుకు ప్రయత్నిస్తుంది. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న జిల్లా బాలల సంరక్షణ విభాగం (డీసీపీయూ), శిశుగృహ (సా) విభాగాల్లో పోస్టుల భర్తీకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి రీనోటిఫికేషన్ ఇచ్చేందుకు ఆ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రీనోటిఫికేషన్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పోస్టుల భర్తీ పక్రియ దాదాపు పూర్తయిన నేపథ్యంలో మళ్లీ నోటిఫికేషన్ ఇస్తామని అధికారులు చెప్పడంతో గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

23 పోస్టులకు నోటిఫికేషన్

డీసీపీయూ, శిశుగృహాల్లో ఖాళీగా ఉన్న 23 పోస్టులకు 2023 నవంబర్ 30వ తేదీన అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో కాంట్రాక్టు పద్ధతిని భర్తీ చేసే పోస్టులు 5, అవుట్ సోర్సింగ్ పోస్టులు 9, పార్ట్ టైమ్ పోస్టులు 9 ఉన్నాయి. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 2023 డిసెంబర్ 11వ తేదీ వరకు గడువు ఇచ్చారు. దీంతో వందలాది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 23 పోస్టులకుగాను 384 మంది దరఖాస్తు చేసుకున్నారు.

కుండపోత..!



పాలకొండ రూరల్: నీలమ్మ ఆలయం వద్ద ప్రధాన రహదారిపై పారుతున్న వర్షంనీరు

- ముసురు పట్టిన మన్యం
- జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేని వాన
- వర్షాలతో ప్రాజెక్టులు, నదుల్లో చేరుతున్న నీరు
- పలు మండలాల్లో నీట మునిగిన పంటలు

సాక్షి, పార్వతీపురం మన్యం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఈ ప్రభావంతో రెండు రోజులుగా జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉండడం..ఎగువ నుంచి వరద నీరు వస్తుండడంతో నదీ తీర ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికే వరి పంట చేల్లో నీరు చేరింది. పలు మండలాల్లో అరటి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలో 12.6 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సీతంపేట 29.4, కురుపాం 25.2, పాలకొండ 19.6, గుమ్మలక్ష్మీపురం 17.8, వీరఘట్టం 14.2 మి.మీ. చొప్పున వాన కురిసింది. ఆదివారం రోజంతా కొన్ని మండలాల్లో ఏకధాటిగా వర్షం పడుతూనే ఉంది. పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సాలూరు నియోజకవర్గంలోని సాలూరు మండలంలో సువర్ణముఖి, గోముఖి నదులు వర్ష ప్రభావంతో పొంగుతున్నాయి. దీంతో తోణాం, దండిగాం కాజ్‌వేల వద్ద ప్రజల రాకపోకలకు కాస్త ఇబ్బందులు ఏర్పడ్డాయి. సాలూరు మండలంలో పత్తి పంటకు నష్టం వాటిల్లగా.. కొన్నిచోట్ల వరిచేలు నీట మునిగాయి. ఇదే మండలంలోని కందులపథం పంచాయతీ తినుసామంతవలస గ్రామంలో విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ సీదరపు ఇందిరమ్మ(50) మృతి చెందింది. మెంటాడ మండలంలో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. పాచిపెంట మండలం పెద్దగెడ్డ జలాశయంలోకి వరద నీరు చేరుతోంది. ఇక్కడ ఇన్‌ఫ్లో 320 క్యూసెక్కులు కాగా.. 300 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. మక్కువ మండలంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 161.00 మీటర్లు కాగా.. ప్రస్తుతం 160.03 మీటర్ల నీరు నిల్వ ఉంది. 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. కాలువల ద్వారా 400 క్యూసెక్కులు.. సువర్ణముఖి రెగ్యులేటర్ ద్వారా సువర్ణముఖి నదిలోకి 200 క్యూసెక్కులు విడిచిపెడుతున్నారు. గోముఖి రెగ్యులేటర్ ద్వారా 200 క్యూసెక్కుల నీటిని గోముఖి నదిలోకి విడిచిపెట్టారు. ఒడిశాలో కురుస్తున్న వర్షాల వల్ల కురుపాం నియోజవవర్గ పరిధిలోని నాగావళి నదికి వరద నీరు పెరుగుతోంది. ఇంకా పెరిగే అవకాశం ఉండడంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి కొమరాడ మండల పరిధిలోని జంఝావతి ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహం నిలకడగా ఉంది. గరుగుబిల్లి మండలం తోటపల్లి రిజ్వరాయర్‌లో 2,160 క్యూసెక్కుల నీరు పై నుంచి వస్తోంది. నదిలోకి 1,851 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. కాలువల ద్వారా 310 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. తోటపల్లి ప్రాజెక్టు సామర్థ్యం 105.00 మీటర్లు కాగా.. ప్రస్తుతం 103.80 మీటర్లు ఉంది.

పాలకొండ పరిధిలో ఏకధాటిగా వాన

పాలకొండ నియోజకవర్గంలో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. పాలకొండ పట్టణంలోని గాయత్రినగర్, గారమ్మకాలనీ ప్రాంతాల్లో రెండు, మూడు అడుగుల మేర నీరు చేరింది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నాగావళి నది నీటి ప్రవాహం పెరిగింది. దీంతో వీరఘట్టం మండలంలో 100 ఎకరాల మేర అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. పాలకొండ మండలంలో నది పరీవాహక గ్రామాలైన అంపిలి, అన్నవరం, మంగళాపురం, గోపాలపురం తదితర ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. చినమంగళాపురం వద్ద నాగావళిపై వంతెన మేరకు నీరు చేరడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. భామిని మండలంలో వంశధార తీరంలో కూడా నీటిమట్టం పెరుగుతోంది. ఇక్కడి రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు.

శనివారం అత్యధికంగా పాలకొండ మండలంలో 19.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో, కొన్ని గ్రామాల్లో పంటచేల్లో సుమారు 2 వేల ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. పాలకొండ-వీరఘట్టం రహదారిలో బాసూరు, వీపీ రాజుపేట, చింతాడ సమీపాల్లో వరి పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువన వర్షం కొనసాగితే నియోజకవర్గంలోని వీరఘట్టం, పాలకొండ ప్రాంతాల్లోని పలు గ్రామాల్లోకి నీరు చొచ్చుకునే ప్రమాదం ఉంది. అటు సీతంపేట మండలంలోనూ శనివారం సాయంత్రం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తోంది.



తోటపల్లి ప్రాజెక్టు వద్ద పరిస్థితి

పెరిగిన తోటపల్లి ప్రవాహం

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రెండురోజులుగా కురుస్తున్న ఎడతెరిపి వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టువద్ద నీటిప్రవాహం కాస్తా పెరిగింది. నాగావళినదిలో తోటపల్లి ప్రాజెక్టు నిటిమట్టం 105 మీటర్ల లెవెల్‌కుగాను ఆదివారం సాయంత్రానికి 103.80 మీటర్ల లెవెల్ లో నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం నదిపై భాగం నుంచి ప్రాజెక్టుకు 2,160 క్యూసెక్కుల వరద నీరు రాగా ఈమేరకు అధికారులు రెండు గేట్లు ఎత్తివేసి 1,851 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువల ద్వారా 310 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.5 టీఎంసీలకుగాను 1.78 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టువద్ద నీటిపరిస్థితిని ఇంజి నీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



పాలకొండ: గాయత్రి నగర్‌లో చేరిన వర్షం నీరు

వైద్య సిబ్బంది అప్రమత్తం

- డీఎంహెచ్ఓ విజయపార్వతి



పార్వతీపురంటౌన్: వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది వారి పరిధిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. విజయ పార్వతి సూచించారు. ఈ మేరకు జిల్లాలో వైద్యాధికారులతో ఆదివారం ఆమె జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పీహెచ్‌సీల పరిధిలో అత్యవసర వైద్య సేవల నిమిత్తం ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ సిద్ధంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల్లో అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలని అన్నారు. వ్యాక్సిన్ నిల్వలు, నిర్వహణ గమనించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా ఇన్వర్టర్, బ్యాటరీల పనితీరు పరిశీలించుకోవాలని హెచ్చరించారు. కాన్పు తేదీ దగ్గరగా ఉన్న గర్భిణులకు తగు రవాణా సౌకర్యం కల్పించి గర్భిణుల వసతి గృహాలు, ప్రాంతీయ, జిల్లా, రిఫరల్ ఆస్పత్రుల్లో చేర్చాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా డయేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలితే ఎపిడిమిక్ టీమ్‌కు వెంటనే తెలియజేయాలని కోరారు. క్షేత్ర స్థాయిలో ప్రజలను అప్రమత్తం చేస్తూ కాచి చల్లార్చిన నీటిని, సాధ్యమైనంత వరకు వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని, ఆరోగ్య సమస్య ఉంటే వైద్య సిబ్బందికి వెంటనే తెలియజేసేలా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: అల్పపీడనం వల్ల రాబోయే రెండు రోజులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం జిల్లా, మండల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఆదివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08963 293046ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే పార్వతీపురం, పాలకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మండలాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఎవరూ ఉండరాదని, వారిని తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. కొండ శిఖర గ్రామాల పరిస్థితిని గమనించి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా వినాయక నిమజ్జనం చేసే సమయంలో తగు జాగ్రత్తలు, సూచనలు తెలియజేయాలని ఆదేశించారు. ఒడిశాలో భారీ వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆకస్మికంగా వరదలు వచ్చే సమయంలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతారని, అటువంటి ప్రదేశాల్లో పోలీసులు, వలంటీర్లు లేదా ఇతరులను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ఆదేశించారు.

సెల్ఫీలు దిగవద్దు

పంచాయతీరాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, అనకట్టలు తనిఖీ చేయాలని, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, గేట్లు, లాకులు తనిఖీ చేసి సక్రమంగా పనిచేసేటట్లు చూడాలని, అవుట్ ఫ్లో సక్రమంగా ఉండే విధంగా చూడాలని స్పష్టం చేశారు. వానలు కురిసేటపుడు సెల్ఫీలు తీసుకోవడానికి, వరదల్లో ఈత కొట్టడానికి ఎవరూ ప్రయత్నించవద్దని పిలుపునిచ్చారు. వాతావరణశాఖ హెచ్చరికల మేరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ఎటువంటి దుర్ఘటనలు సంభవించరాదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవ నాయుడు, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



ఏకదంతాయ నమోనమః

జిల్లావ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్ని వయస్సుల వారు పాల్గొని తాము తలపెట్టే పనుల్లో విఘ్నాలు తొలగించి అన్నింటా జయము కలిగేలా ఆశీర్వదించమని ఓ గౌరీ తనయుడిని వేడుకున్నారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నవరాత్రి మంటపాలను అందంగా అలంకరించి వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. మంటపాల వద్ద నవరాత్రుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. పిల్లలు పెద్దలు, మహిళలు వినాయక సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

-పార్వతీపురంటౌన్

ఐటీడీఏకు పీఓ నియామకం ఎప్పుడో?

- ఎదురు చూస్తున్న గిరిజనం
- పాలకొండ సబ్‌కలెక్టర్‌కు ఐటీడీఏ ఎఫ్ఏసీ

సీతంపేట: .జిల్లాలోని సీతంపేట ఐటీడీఏకు ప్రత్యేకంగా స్వతంత్ర ప్రాజెక్టు అధికారిని నియమించే అవకాశాలు నానాటికీ సన్నగిల్లుతున్నాయి. రెండు రోజుల క్రితం పాలకొండ సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సి.యశ్వంత్‌కుమార్ రెడ్డికి ఐటీడీఏ పీఓగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు. ప్రత్యేకంగా ఒక ఐఏఎస్ ఆఫీసర్‌ను స్వతంత్రంగా ఐటీడీఏకు నియమించాల్సి ఉన్నప్పటికీ ఎఫ్ఏసీ ఇవ్వడంతో ఇప్పట్లో పీఓగా మరొకరిని నియమించే అవకాశం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రెండు నెలల కిందట ఐఏఎస్ రాహుల్‌కుమార్‌రెడ్డిని నియమించిన కొద్ది రోజులకు ఇక్కడి నుంచి బదిలీ చేశారు. ఆ తర్వాత పాలకొండ ఆర్డీవో వి.వి.రమణకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అనంతరం పాలకొండ డివిజన్‌కు సబ్‌కలెక్టర్ జాయిన్ కావడంతో ఆయనకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో ఇలా...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా ఐఏఎస్ ఆఫీసర్‌లనే పీఓలుగా నియమించారు. అప్పట్లో పీఓలుగా ఐఏఎస్ అధికారులు సీహెచ్ శ్రీధర్, సాయికాంత్ వర్మ, కల్పనాకుమారిలు పనిచేశారు. పాలకొండకు సబ్‌కలెక్టర్‌గా నూరుల్ కమల్ పనిచేశారు. ఎవ్వరికీ ఇన్‌చార్జ్, ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించక పోవడంతో ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వహించి, గిరిజన సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారు.



సీతంపేట ఐటీడీఏ

ఇదీ పరిస్థితి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 19 సబ్‌ప్లాన్ మండలాలు ఉన్నాయి. ఇటు పాలకొండ నియోజకవర్గం పరిధిలో 4 మండలాలు, శ్రీకాకుళం జిల్లాలో 15 మండలాలు ఉన్నాయి. 1250 గ్రామాలు ఉన్నాయి. దాదాపు 2 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. 13కు పైగా ప్రభుత్వ శాఖలు వివిధ పథకాలను గిరిజనుల కోసం అమలు చేస్తున్నాయి. ఐటీడీఏ పరిధిలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాలలు, 10 పోస్టు మెట్రిక్ వసతిగృహాలు, మరో 8 గురుకులాలు నిర్వహిస్తున్నారు. 16 వేల మంది గిరిజన విద్యార్థులు వాటిలో చదువుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇన్‌చార్జ్‌లు లేరు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఐటీడీఏకు ఎఫ్ఏసీ, ఇన్‌చార్జ్‌లను వేయలేదు. డైరెక్ట్‌గా పీఓ పోస్టులో ఐఏఎస్‌ను నియమించారు. ఇన్‌చార్జ్‌లతో కాలం గడిపితే పాలనా పరమైన పర్యవేక్షణ తక్కువవుతుంది. కూటమి ప్రభుత్వంలో ఐటీడీఏకు ప్రత్యేకంగా పీఓను నియమించకపోవడం విడ్డూరంగా ఉంది.

విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే

మృతుడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండ

- రూ.5లక్షలు ఆర్థిక సాయం అందజేత
- చెక్కును అందజేసిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు

పార్వతీపురం టౌన్: అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్‌లో గల ఫార్మా కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మరణించిన బాధితుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలం డోకిసీల పంచాయతీ, చెలంవలస గ్రామానికి చెందిన మృతుడు జవ్వాది పార్థసారథి కుటుంబాన్ని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా పార్టీ అధ్యక్షులు ఏస్ పరీక్షిత్ రాజు, స్థానిక మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావులతో కలిసి ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ తరఫున రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధినేత మృతిచెందిన ప్రతి ఒక్కరికి రూ. 5లక్షలు చెప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

క్లుప్తంగా

జెడ్పీలో వినాయక సందడి

• పాల్గొన్న చైర్మన్ శ్రీనివాసరావు


గణపతికి తొలిపూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనువాసరావు, తదితరులు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం వినాయకచవితి సందడి నెలకొంది. స్వామివారికి తొలిపూజలో జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదంతా ఎటువంటి విఘ్నాలు లేకుండా ఉమ్మడి జిల్లావాసులు ఆనందంగా ఆరోగ్యంగా ఉండేలా విఘ్నేశ్వరుడి ఆశీర్వాదం ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ పూజల్లో జెడ్పీ సీఈఓ ఎల్.ఎస్.వీ. శ్రీదర్‌రాజా పాల్గొన్నారు

10న అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం రూరల్: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన అండర్ 14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి సీతారామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంలోని విజ్జి క్రికెట్ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2010 సెప్టెంబర్ 1 తరువాత జన్మించినవారై ఉండాలని, అలాగే పోటీలకు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్స్, మూడేళ్ల మార్కుల జాబితా తీసుకుని హాజరుకావాలని చెప్పారు. ఎంపికలు నిర్వహించే రోజు ఉదయం 7గంటలకు తెలుపు రంగు దుస్తులతో పాటు సొంత క్రికెట్ కిట్‌తో హాజరు కావాలని కోరారు.

10న ఫైజర్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక

విజయనగరం ఫోర్ట్: మహారాజా కాలేజీ ఆఫ్ ఫార్మశీలో ఈనెల 10వతేదీ ఉదయం 9 గంటల నుంచి విశాఖపట్నానికి చెందిన ఫైజర్ ఫార్మా హెల్త్ కేర్ లిమిటెడ్ ఉద్యోగ ఎంపికలు నిర్వహిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ఉదయ శంకర్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కృష్ణంరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023, 2024లో డి ఫార్మశీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


రాంబాబు (ఫైల్)

బొండపల్లి: మండలంలోని కొండకిండాం గ్రామానికి చెందిన వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. దీనిపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కలిశెట్టి రాంబాబు(36) మద్యానికి బానిసై కొద్ది రోజులుగా ఎటువంటి పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటూ నిరంతరం తాగుతున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు నిలదీయడంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో విజయనగరంలోని కేంద్రాస్పత్రికి కుటుంబసభ్యులు తరలించగా చికిత్స పొందు తూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవ పంచనామా నిర్వహించినట్లు ఎస్సై తెలియజేశారు.

తారాపురంలో మరో వ్యక్తి..


తవుడు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని తారాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రేగు తవుడు (59) మద్యానికి బానిసై ప్రతి రోజూ తప్పతాగి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులు గట్టిగా మందలించడంతో మనస్తాపం చెంది శనివారం గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయమాడు. గమనించిన భార్య లక్ష్మి, కుమారుడు మహేష్ విజయనగరంలోని జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రమణ కేసునమోదు చేశారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం


విజయనగరం టౌన్: గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీరామనారాయణం ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచనం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, శ్రీమాన్ వంగీపురం రామానుజ అవార్డు గ్రహీత డాక్టర్ పి.స్వప్న హైందవి ప్రవచనం చేశారు. స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కళాశాల విద్యార్థులతో నిర్వహించిన వయోలిన్ కచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది.

అంధకారంలో నగర పంచాయతీ

నెల్లిమర్ల: నగర పంచాయతీ అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. ఆదివారం తెల్లవారుజామున వర్షం కురవడంతో నెల్లిమర్ల, జరజాపుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం నుంచి విద్యుత్ సిబ్బంది 33 కేవీ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నా సరఫరా పునరుద్ధరించలేకపోయారు.

ఎడతెరిపి లేని వర్షం

• ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు
• తుఫాన్ సమయంలోనూ వేటకు వెళ్లిన మత్స్యకారులు
• అతికష్టం మీద ఒడ్డుకు చేరిన బోట్లు
• తీరంలో జాడలేని రెవెన్యూ, మెరైన్ అధికారులు


ఉధృతంగా ప్రవహిస్తున్న చంపావతి నది


చింతపల్లిలో ఉధృతంగా వస్తున్న కెరటాలు



చింతపల్లితీరంలో వేటకు వెళ్లి చేపలతో అతికష్టం మీద ఒడ్డుకు చేరిన మత్స్యకారులు

పూసపాటిరేగ:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితల ఆవర్తన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కొత్త నీరు సముద్రంలో చేరడంతో కడలి అల్లకల్లోలంగా మారింది. అలల ఉధృతికి సముద్రం ముందుకు రావడంతో తీరం కొన్ని చోట్ల కోతకు గురైంది. తీరంలో ఉన్న పడవలు, వలలను మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మత్స్య కారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని అధికారులు ఎటువంటి హెచ్చరికలు జారీ చేయకపోవడంతో చింతపల్లిలో కొంతమంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు ఆదివారం వెళ్లారు. భారీవర్షాలు, గాలులు వీస్తుండడంతో రెవెన్యూ, మెరైన్ అధికారులు తీరంలో ఉండి మత్స్యకారులను అప్రమత్తం చేయకపోవడంతో వారు యథావిధిగా వేటసాగించారు. తీర ప్రాంత గ్రామాలైన చింతపల్లి, పతివాడబర్రిపేట, తమ్మయ్యపాలెం, పులిగెడ్డ, తిప్పలవలస, కోనాడ గ్రామాల్లో మత్స్యకారులు భారీ వర్షాల కారణంగా వారంతట వారే వేటను విరమించుకోగా కొంత మంది మాత్రం వేటను యథావిధిగి కొనసాగించారు. సముద్రాన్ని ఆనుకుని ఉన్న తిప్పలవలస, చింతపల్లి, పతివాడబర్రిపేట గ్రామాల మత్స్యకారులు భారీ వర్షాల ప్రభావంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

తుఫాన్లు వస్తే పస్తులే

తుఫాన్‌లు వచ్చినప్పుడు వేట సాగక జీవనోపాధికి ఇబ్బంది కలుగుతోందని పలువురు మత్స్యకారులు వాపోతున్నారు. వాతావరణ పరిస్థితిపై అవగాహన కల్పించే వారే లేరని మరి కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసి లోతట్టు ప్రాంతాలు జలమయమైనా అధికారులు కనీసం పట్టించుకోలేదని పలువురు మత్స్యకారులు చెబుతున్నారు. చింతపల్లిలో ఆదివారం కొంతమంది మత్స్యకారులు యథావిధిగా చేపట వేట సాగించినా అధికారులు కనీసం పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

నెల్లిమర్ల: నియోజకవర్గం పరిధిలోని చంపావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నదిలో భారీగా వరదనీరు చేరింది. ముఖ్యంగా నది జన్మస్థలం ఆంధ్ర కొండల్లో వర్షం ఎక్కువగా కురవడంతో నిన్నటి వరకు నీరులేక వెలవెలబోయిన నది కళకళలాడుతోంది. ఎగువన ఉన్న గుర్ల గెడ్డ, గడి గెడ్డ, ఊట గెడ్డలోని నీరు నదిలో చేరడంతో నిండుగా ప్రవహిస్తోంది. వర్షం కురవడం ఇలాగే కొనసాగితే సోమవారం నాటికి నదిలో నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది. అదే గనుక జరిగితే రామతీర్థం వైపు వెళ్లే రహదారిలోని వంతెన మునిగిపోయి, రాకపోకలు బంద్ అయ్యే ఆస్కారం ఉంది. ఇదిలా ఉంటే నదిని చూసేందుకు పట్టణవాసులు అధిక సంఖ్యలో వస్తున్నారు. నదిలో ఎవరూ దిగకుండా, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తహసీల్దార్ సుదర్శనరావు, నగర పంచాయతీ కమిషనర్ విశ్వేశ్వరరావు చర్యలు చేపట్టారు. నది వద్ద సిబ్బందిని కాపలాగా ఉంచారు.

బైక్‌ను కారు ఢీకొని వ్యక్తి మృతి


సతీష్ మృతదేహం

లక్కవరపుకోట: మండలంలోని అరకు-విశాఖ రోడ్డులో కొత్తగంగుబూడి జంక్షన్ సమీపంలో శనివారం జరిగిన ప్రమాదంలో గంగుబూడి గ్రామ మాజీ ఉపసర్పంచ్ లెంక సతీష్(45) మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై గోపాలరావు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారంలో పనిచేస్తున్న లెంక సతీష్ శనివారం మధ్యాహ్నం విధులు ముగించుకుని స్వగ్రామం గంగుబూడికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదే సమయంలో ఎస్.కోట నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు డ్రైవర్ ముందున్న మేకల మందను ఒక్కసారిగా కారు బ్రేకులు వేశాడు. దీంతో ఆ కారు వెనుకనే ద్విచక్రవాహనంపై వస్తున్న సతీష్ అదుపు తప్పి వెనుక నుంచి కారును బలంగా ఢీకొట్టి తుళ్లి రోడ్డుపై పడిపోగా తలకు తీవ్రమైన గాయమై అధిక రక్తస్రావం జరిగింది. వెంటనే కొత్తవలసలో గల ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సమాచారం అందుకున్న ఎల్.కోట ఎస్సై ఆర్.గోపాలరావు శవపంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, నాలుగు సంవత్సరాల పాప ఉన్నారుప

కారు ఢీకొని మరో వ్యక్తి..


అప్పలనాయుడు మృతదేహం

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో జాతీయ రహదారి26ను ఆనుకుని ఉన్న ఇంటిపైకి వేగంగా దూసుకు వచ్చిన కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై యు.మహేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నిమ్మాది అప్పలనాయుడు(68) జాతీయ రహదారి పక్కన గల ఇంటి ముందు నిలబడి ఉండగా గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న బొలెరో వాహనం వేగంగా వస్తూ అదుపు తప్పి ఇంటి ముందుకు దూసుకువచ్చి అక్కడ నిల్చున్న అప్పలనాయుడిని బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ..


ఇందిరమ్మ (ఫైల్)

సాలూరు రూరల్: మండలంలోని కందులపదం పంచాయతీ తీన్ సామంతవలస గ్రామానికి చెందిన సీదరపు ఇందిరమ్మ(50) విద్యుత్ షాక్‌తో మృతి శనివారం చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ ఇంట్లో సన్‌స్లేడ్‌కు ఉన్న ఐరన్ కొక్కాలకు వేలాడుతున్న ఇనుప వైరుపై ఆమె బట్టలు ఆరబెడుతున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురైంది. వర్షాల కారణంగా ఇంటి శ్లాబ్ అంతా చెమ్మతో ఉండడంతో ఇల్లంతా పూర్తిగా విద్యుత్ సరఫరా కాగా ఆమె షాక్ తగిలి మృతిచెందింది. ఆ సమయంలో ఇంటిలో ఉన్న తన కూతురు కర్రతో కొట్టి షాక్‌నుండి తప్పించే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకపోయింది.

ఉత్సవ కమిటీ సభ్యులదే పూర్తిబాధ్యత


గణపతి మంటపాల వద్ద పర్మిషన్‌లను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణపతి మంటపాలను ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో పోలీసు అధికారులు, సిబ్బంది, శని,ఆదివారాల్లో సందర్శించి వాటి అనుమతులను పరిశీలించారు. ఉత్సవాలకు ఇంకనూ అనుమతులు పొందని వారికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఉత్సవాలు నిర్వహించేటప్పుడు పూర్తి బాధ్యత ఉత్సవ కమిటీ సభ్యులదేనని స్పష్టం చేశారు. ఉత్సవాల వల్ల ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మంటపాలను సందర్శించేందుకు వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్ చేసేందుకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని, ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. ఉత్సవాల నిర్వహణ వల్ల స్థానికులు, ఇతర మతస్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్దిష్టమైన సౌండ్‌తో మాత్రమే మైకులను వినియోగించాలని సూచించారు. ఉత్సవాల వద్ద డీజేలు, అశ్లీల నృత్యాలు నిర్వహించరాదన్నారు. నిమజ్జనం నిర్వహించే సమయంలో మద్యం సేవించడం, కళ్లకు హాని కలిగించే రంగులు జల్లుకోవడం, బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులే చర్యలు చేపట్టాలని కోరారు. విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువులు, నదుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని, గజఈతగాళ్లను నియమించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రైలు ఢీకొని రాజాం పట్టణానికి చెందిన యువకుడు తలచింతల గౌరీశంకర్(37) మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూధనరావు తెలిపారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫాంలో రైలు ఎక్కేందుకు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొన్నట్లు చెప్పారు. గౌరీశంకర్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 6న రాజాం వెచ్చిన ఆయన తిరిగి శనివారం హైదరాబాద్‌కు పయనమయ్యాడు. రైల్వేస్టేషన్‌లో టిక్కెట్ కొనుక్కుని రెండో నంబర్ ప్లాట్‌ఫాంలో రైలు ఎక్కేందుకు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. మృతుడు గౌరీశంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి దుర్మరణం చెందడంతో భార్యాపిల్లలు, మృతుడి తల్లిదండ్రులు భోరున విలపించారు. ప్రమాద దృశ్యాన్ని వీక్షించిన స్థానికులు, రైల్వే స్టేషన్ సిబ్బంది కళ్లు చెమర్చాయి.

అంతర్ జిల్లాల బీబీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక


అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తెర్లాం: అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక ఆదివారం తెర్లాం మండలంలోని నెమలాం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగింది. ఈ నెల 13 నుంచి 15వరకు అన్నవరంలో జరగనున్న అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి పాల్గొననున్న బాలుర, బాలికల జట్లకు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ జి.సుందరరావు ఆధ్వర్యంలో 24మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో చైర్మన్ జి.సుందరరావు మాట్లాడుతూ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు బాగా రాణించాలని కోరారు. బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికకు పీడీలు జి.సింహాచలం, సతీష్, నాగమణి, రామినాయుడు హాజరయ్యారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు బూశాయవలస జెడ్పీ హైస్కూల్ పీడీ రామినాయుడు టీ షర్టులు స్పాన్సర్ చేశారు.

విక్రేతలు, కొనుగోలుదారులపై కేసులు నమోదు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

బొబ్బిలి: పట్టణంలోని సీబీఎం స్కూల్ విక్రేతలు, కొనుగోలుదారులపై కేసులు నమోదు చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు పొట్నూరు శంకరరావు, ఎస్.గోపాలం, కోట అప్పన్నలు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలోని సీబీఎం పాఠశాల వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఎకరా 20 సెంట్ల భూమికి బదులు కోమటిపల్లిలో భూమిని కేటాయిస్తున్నట్లు రిజిస్ట్రేషన్‌లో చూపించడం దారుణమన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియకుండా ఈ రిజిస్ట్రేషన్ జరిగిందా అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు.

డ్రాగన్ ఫ్రూట్స్.. విటమిన్స్ ఫుల్

• రైతుకు లాభం..వినియోగదారులకు ఆరోగ్యం
• మార్కెట్‌లో భలే గిరాకీ


తాలాడలో డ్రాగన్ పంట


పసుకుడి వద్ద అమ్మకానికి సిద్ధం చేసిన డ్రాగన్ ఫ్రూట్స్

భామిని:

విదేశాల్లో సంపన్నులు తినే డ్రాగన్ ఫ్రూట్‌ను చూడడమే అరుదు. అలాంటి పంట సాగుపై పార్వతీపురం మన్యం జిల్లాలోని ఔత్సాహిక రైతులు దృష్టిపెట్టి సాగు చేస్తుండడం ప్రత్యేకత సంతరించుకుంటోంది. సంప్రదాయ పంటలకు భిన్నంగా యువ రైతులు వాణిజ్య పండ్ల తోటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఆరోగ్యాన్నిచ్చే పండ్ల తోటల పెంపకంతో అధికాదాయం దిశగా సాగుతున్నారు. మార్కెటింగ్ వ్యూహాన్ని పసిగట్టి ఆర్థికంగా వెసులుబాటు ఉన్న రైతులు డ్రాగన్‌ఫ్రూట్ సాగు వైపు రావాలని జిల్లా ఉద్యాన శాఖాధికారులు పిలుపునిస్తున్నారు.

జిల్లాలో విస్తారంగా సాగు ..

భామిని, పార్వతీపురం, కురుపాం, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, సాలురు, మక్కువ ప్రాంతాల్లో డ్రాగన్ సాగవుతోంది. ఆరంభంలో అధిక పెట్టుబడి కావడంతో పెద్ద రైతులు కొంత భూమిలో వాణిజ్య పంటగా సాగు చేస్తున్నారు. ముందుగా తక్కువ విస్తీర్ణంలో డ్రాగన్ తోటలు నాటుతున్నారు. మార్కెట్‌లో వినియోగం పెరుగుదలకు తగ్గట్లు విస్తీర్ణం పెంచడానికి రైతులు యోచిస్తున్నారు. ఉద్యానవన శాఖ ద్వారా ఎకరాకి రూ.1 లక్ష వరకు మాత్రమే రాయితీ ఇస్తున్నారు. డ్రాగన్ పండ్ల తోటల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధికంగా దిగుబడులు, లాభాలు ఆర్జించవచ్చని ఉద్యాన వన శాఖాధికారులు చెబుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

డ్రాగన్ ఫ్రూట్ చెట్టును వాడుక భాషలో సిరి జమ్మెడ చెట్టు అంటారు. ఇది ఎడారి జాతికి చెందిన పండ్ల మొక్క. ఈ పండులో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. డ్రాగన్ ఫ్రూట్‌ను సుగర్ వ్యాధిగ్రస్తులు యథేచ్ఛగా తినవచ్చు. ఇందులో చక్కర శాతం తక్కువగా ఉండడంతో మధుమేహ బాధితులు తినవచ్చని వైద్యులు చెబుతున్నారు. అంతే కాకుండా ఈ ఫ్రూట్‌లో శరీరానికి అవసరమైన యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ ఉంటాయి.ఈ పండును తినడం ద్వారా బరువు నియంత్రణ, అస్తమా, చెడు కొలెస్ట్రాల్ తగ్గడం, డయాబెటిస్ నియంత్రణ లాంటి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి.

అన్ని రకాల నేలలు అనుకూలం..

డ్రాగన్ ఫ్రూట్‌ను పండించేందుకు అన్ని రకాలైన నేలలు అనుకూలం. ముఖ్యంగా మంచి సేంద్రియ కర్బనంతో కూడిన ఇసుక నేలలు మరింత శ్రేష్ఠం. ఈ పంటకు నీటి అవసరం చాలా తక్కువ. పూత, కాయ సమయాల్లో 3-4 తడులు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. ఇందులో మూడు రకాలు ఉన్నాయి. వైట్ ఫ్లాష్ డ్రాగన్, రెడ్ ఫ్లాష్ డ్రాగన్, ఎల్లో ఫ్లాస్ డ్రాగన్ రకాలు ఉన్నాయి.

20 ఏళ్ల పాటు దిగుబడి

ఈ పంట ఒకసారి నాటితే 20 సంవత్సరాల వరకు పంట దిగుబడిని ఇస్తుంది. స్తంభానికి నలు దిక్కులా 2అడుగుల పొడవు, వెడల్పు 1 అడుగు లోతు గుంతలు తవ్వాలి. గుంతలో 25 కిలోల పశువుల ఎరువు, కిలో వేపపిండి వేసి మొక్కలు నాటాలి. నేలను బట్టి సాగు చేసిన రకాలను బట్టి తడులను ఇవ్వాలి.నీరు ఎక్కువైతే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉంది. ఏడాదిలో రెండు సార్లు జూన్-జనవరి నెలల్లో పశువుల ఎరువు వేసి సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. సాధారణంగా డ్రాగన్ మొక్కలు తొలికాపు కాయ దానికి రెండు నుంచి మూడు సంవత్సరాల సమయం పడుతుంది. డ్రాగన్ సాగుకు ఎకరాకి రూ.3లక్షల నుంచి రూ.4లక్షలు ఖర్చు అవుతుంది. ఎకరాకి దిగుబడి 6 నుంచి 8 టన్నుల వరకు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్ కేజీ ధర రూ.200 నుంచి రూ.250 పలుకుతోంది.

దిగుబడి బాగుంది..

డ్రాగన్ పంట సాగును తక్కువ స్థలంలో చేపట్టాం. అర ఎకరాలో పంట వేశాం. ఏడాది పొడవునా నాలుగు కాపులు వస్తోంది. ఒక్కో కాపు సమయంలో రూ.40వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తోంది. దిగుబడి పెరిగితే మరింత విస్తరిస్తాం. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం పెంచితే ఇంకా మంచిది. పంట నిర్వహణ సులభంగా ఉంది.

–సాసుబిల్లి రాజేంద్ర నాయుడు, రైతు, పసుకుడి, భామిని మండలం

లక్ష వరకు రాయితీ..

డ్రాగన్ పంట సాగు ఆరంభంలో పెట్టుబడి ఎక్కువ. ఉద్యాన వన శాఖ నుంచి ఎకరాకి రూ.1 లక్ష వరకు రాయితీ అందుతుంది. సాంకేతిక సహాయం అందిస్తాం. ఇది 20 ఏళ్ల వరకు ఆదాయం వచ్చే వాణిజ్య పంట, ఆరంభంలో కాస్తా ఎక్కువ పెట్టుబడి. తరువాత ఆదాయం నిరంతరం పెరుగుతూ ఉంటుంది. ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయవచ్చు.

–పేడాడ జయశ్రీ, ఉద్యాన వన అధికారి, ఐటీడీఏ, సీతంపేట

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹108	₹186	₹196